కథ

# లాస్ట్ పాసింజర్

సమయం రాత్రి తొమ్మిదిన్నర కావస్తూంది.

అమావాస్య రోజులు కావటంతో చీకటి చిక్కగా ఉంది.

ఇళ్ళల్లో వెలిగే దీపాల కాంతి తప్ప బయట రోడ్లమీద వెలుగు లేదు.

పల్లెటూరు కావటంతో వీధి దీపాల సౌకర్యం లేదు.

నగర వాతావరణం అసలే లేదు. శుద్ధ పల్లెటూరు!

''నాకా పళ్ళెటూళ్ళంటే ఆసక్తి లేదు. సిటీలో పుట్టి పెరిగిన నేను విధి లేక బ్యాంకు ఉద్యోగం వదులుకోలేక ఫస్ట్ అపాయింట్‌మెంటు గనక ఈ పల్లెకి రావాల్సి వచ్చిందిగాని లేకపోతే అసలు ఇటువంటి ఊరు అంటూ ఒకటి వుంటుంది అంటే నమ్మేవాడ్ని కాదు.

గుడ్డిలో మెల్ల అన్నట్లు చిన్న రైలు స్టేషన్ మాత్రం ఉంది.

మా అమ్మకి సీరియస్‌గా వుందని, వెంటనే బయలుదేరి రమ్మని అన్నయ్య ఆఫీసుకి ఫోన్ చేశాడు.

లాస్ట్ పాసింజర్ రాత్రి పదిన్నర పదకొండు గంటల మధ్య వుంది.

అది తప్పితే మళ్ళీ తెల్లారేదాకా ఏ రైలు లేదు.

ఇంత పల్లెటూరు లోనూ వున్న ఒకే ఒక్క సౌకర్యం ఈ పాసింజర్ రైలు.

ఇది ఎక్కితే తెల్లారే సరికి మా ఊరు విజయవాడ చేరుతుంది.

అందుకే రాత్రి చీకట్లో హడావుడి పడుతూ రెండు కిలోమీటర్లు మట్టిరోడ్డు మీద నడిచి స్టేషన్‌కి వచ్చాను.

ఊళ్ళోంచి రైలు స్టేషన్‌కి గాని మరెక్కడికైనా గాని వెళ్ళాలంటే బస్సు ఆటోరిక్షా లాంటి సౌకర్యం లేదు.

వెహికిల్సు వున్న వాళ్ళకి ఫరవాలేదు. లేకపోతే కాలినడకో ఎడ్లబండో శరణ్యం.

నాకు స్కూటరుంది. కాని స్కూటరు మీద స్టేషన్‌కి వస్తే దాన్ని ఎక్కడ పెట్టాలి? స్టేషన్ చుట్టూ అన్నీ పొలాలు పంట బోదెలే.

మా బ్యాంకు ప్యూనుకి స్కూటరురాదు. మా క్లర్క్ కమ్ క్యాషియర్‌కి కొత్తగా పెళ్ళయింది. భార్య పది రోజుల క్రితమే కాపురానికి వచ్చింది.

ఇంత రాత్రి అతన్ని ఎలా ఇబ్బంది పెట్టను?

మా అకౌంటెంటు బాగా పెద్దాయన. సిటీలో కాపురం. పిల్లల చదువుల దృష్ట్యా ఫ్యామిలీని సిటీలోనే వుంచాడు.

సాయంత్రం ఆరు కాగానే ఆయన స్కూటర్ మీద సిటీ వెళ్లిపోతాడు.

ఊళ్ళో కొంతమంది యువకులకి టూవీలర్స్ ఉన్నాయి. బ్యాంకు మేనేజర్ని ఎవర్ని అడిగినా సహాయం చేస్తారు. కాని లేని పోని మొహమాటం. అందుకే కాలినడకన స్టేషన్ చేరుకున్నాను.

నాలుగు రోజులు శెలవు మీద అకౌంటెంట్‌కి చార్జి ఇచ్చాను.

స్టేషన్ నిర్మానుష్యంగా ఉంది.

అమావాస్య రోజులు కావటంతో ఎటు చూసినా చీకటి

రైలుకట్టకి అటంతా పొలాలు జీదురుమంటున్నాయి.

నేను స్టేషన్‌కి వచ్చేసరికి స్టేషన్‌లో పాసింజర్లు ఎవరూ లేరు.

ఇందాక కర్రపోటు వేస్తూ స్టేషన్ మాస్టర్ గది పక్క నుంచి వచ్చిన ముసల్ది...వణవణ వణుకుతుంది. తలంతా నెరిసిపోయి అంత చీకట్లోనూ తెల్లగా మెరుస్తుంది. కాంతి కోల్పోయిన ముసల్దాని గాజు కళ్ళు ఆశగా నాకేసి చూస్తున్నాయి. పళ్ళన్నీ వూడిపోయిన బొక్కి నోరు..అప్పుడే వేడి వేడి టీ చప్పరిస్తున్నట్లు పెదాలు నాలికతో తడుపుకుంటోంది.

ఆ చివర సిమెంటు బెంచి మీద ఎవరో ముసిలాడు నిండా ముసుగు కప్పుకుని పడుకున్నాడు.

కదులు మెదులు లేదు.

తలమీంచి కాలి దాకా కప్పుకోవడంతో 'శవం'లా అనిపిస్తుంది. ఆ చీకట్లో అంతరాత్రి..ఆ నిర్మానుష్యం..

నాకు భయం అనిపించింది. అందుకని స్టేషన్‌కి ఈ చివరగా వున్న సిమెంటు బెంచి మీద వచ్చి కూర్చున్నాను, కాని నా దృష్టంతా శవంలా పడుకొన్న ఆ ముసుగు మనిషి మీదే వుంది.

సరిగ్గా పదిం ముప్పావుకి బండి అని చెప్పాడు స్టేషన్ మాస్టరు. ఈ బండి దాటితే తెల్లరేదాకా ఏ బండి లేదు.

స్టేషన్‌లో కనీసం లైట్లు లేవు.

దూరంగా చెట్టు కింద వున్న స్టేషన్ మాస్టరు గదిలో మాత్రం లైటు వెలుగుతూంది. ఆ వెలుగే కాస్త అటు ఇటు ప్రసరిస్తూంది కిటికీల్లోంచి.

రైలు వచ్చాక స్టేషన్ మాస్టర్ కూడా ఆ చిన్న గదికి తాళం పెట్టి వెళ్ళి పోయే ప్రయత్నంలో ఉన్నాడు.

నా మనసు మనసులో లేదు.

''అమ్మకి ఎలా వుందో! ఆవిడకి బాగా షుగరుంది. వెంటనే బయలుదేరి రమ్మని అన్నయ్య ఫోన్ చేశాడంటే సీరియస్‌గా వుందేమో..''

ఆలోచిస్తూ సిగరెట్టు వెలిగించాను. పొగ వదులుతూ యథాలాపంగా తల తిప్పిన నాకు స్టేషన్ మాస్టారు గది పక్క నుంచి ఎవరో నా వైపు రావటం గమనించాను.

నల్లని నీడ..లా..నిండా దుప్పటి కప్పుకుని చేతి కర్రని నేలకు తాటిస్తూ..మరో చేతిని నడుం దగ్గర ఆసరా పెట్టుకుని నా వైపే వస్తుంది ఓ ముసలమ్మ.

''ఇంత రాత్రి ఈ ముసలమ్మ కూడా రైలు ప్రయాణం చెయ్యబోతూందా?'' నాకు నవ్వు వచ్చింది.

తలతిప్పి దూరంగా బెంచికేసి చూశాను. ఆ శవంలా పడుకున్న వ్యక్తిలో కదలిక లేదు. మనిషై వుండడు. ఎవరైనా చంపి అలా పడుకోబెట్టలేదు కదా? పల్లెటూళ్ళలో రాజకీయాలు నక్సల్ గొడవలు ఎక్కువ. పోనీ స్టేషన్ మాస్టర్‌కి నా అనుమానం గురించి చెప్తే ఆ శాల్తీ గురించి ఆయన గమనించాడో లేడో.

''బాబయ్యా..'' ఏదో మెత్తగా కాలిని స్పర్శిస్తుంటే వులిక్కిపడుతూ తల తిప్పాను.

''బాబయ్యా. రెండు రూపాయలుంటే దరమం సెయ్యి బాబయ్యా. టీ తాగుతాను. నాలుగు దినాలుగా జ్వరంతో సచ్చిపోతున్నాను బాబయ్యా.''

ఇందాక కర్రపోటు వేస్తూ స్టేషన్ మాస్టర్ గది పక్క నుంచి వచ్చిన ముసల్ది...వజవజ వణుకుతుంది. తలంతా నెరిసిపోయి అంత చీకట్లోనూ తెల్లగా మెరుస్తుంది. కాంతి కోల్పోయిన ముసల్దాని గాజు కళ్ళు ఆశగా నాకేసి చూస్తున్నాయి. పళ్ళన్నీ వూడిపోయిన బొక్కి నోరు..అప్పుడే వేడి వేడి టీ చప్పరిస్తున్నట్లు పెదాలు నాలికతో తడుపుకుంటోంది.

దీనంగా నా ముఖంలోకి చూస్తూ తన రెండు

చేతుల్ని నా కాళ్ళ మీద కదిలిస్తుంది.

నాకు మా అవ్వ జ్ఞాపకం వచ్చింది.

జేబులోంచి ఐదు రూపాయిలు తీసి ముసల్దానికిచ్చాను.

అంత చీకట్లోను ముసలమ్మ గాజు కళ్ళు ఆనందంగా మెరవటం గమనించాను.

''దరమ పెబువులు..నా ఆయుస్సు కూడా పోసుకుని బతుకు తండ్రి. జరంతో సచ్చిపోతున్నా అయ్యా. ఎగసాయం పన్లు సేసి సంపాయించుకున్నోళ్ళు సంపాయించుకుని బతికా. ఇప్పుడు వయసయిపోనాది. టేసన్‌కి ఎవరన్నా వచ్చినపుడు ఇట్టా దరమం అడుక్కుంటా బాబయ్యా. జొరం నోరు..టీ తప్పించి ఏది సయించటం లేదు బాబయ్యా'' ముసల్ది వణికే చేతుల్తోనే దణ్ణం పెట్టింది.

''జొరంగా వుంటే మరి మందు తినలేదా అవ్వా?'' అడిగాను.

''మందా. పేద్దాన్ని నాకు మందులు మాకులు ఏడనుంచి వత్తయి బాబయ్యా. నీతాన ఏదైనా గోలీ వుంటే ఇయ్యి''

''నా దగ్గర ప్రస్తుతం లేవు. మళ్ళీ వచ్చినపుడు తెచ్చిస్తాలే..కావాలంటే చెప్పు''

''కావాలి బాబయ్యా. ఈ మద్దిన ఈ సలిగాలి పడటం లేదు. పది దినాల కోసారి జొరం వత్తాంది, తగ్గుతూంది. ఏదో గోలి అంట అదేమిటీ టీ తాగుతే జొరం తగ్గుదంటగా!?''

ముసల్ది గాజు కళ్ళతో నాకేసి చూస్తోంది.

నాకు నవ్వు వచ్చింది. ''అవును. నే తెచ్చిస్తాలే. అద్సరే నీ ఇల్లు ఎక్కడ? ఇంత రాత్రి నీకా టీ ఎక్కడ దొరుకుతుంది?'' అన్నాను.

''అదిగో..ఆ రైలు గేటు పక్కన లాంతరు కనిపిస్తోందా. అదే రాజయ్య టీ కొట్టు బాబయ్యా. ఆ కొట్టు ఎనకే పాకుంది సూడు. అదే నా ఇల్లు బాబయ్యా''




తండి చేతిని నేలకి తాటించి లేచి నిల్చుంది.

కర్రని నేలకి తాటిస్తూ ''పోయొస్త బాబయ్యా. బన్ను తిని టీ తాగుత. మళ్ళీ అడు దుకాణం కట్టేస్తాడు'' అంటూ కర్రని టక్ టక్ నేలకి కొడుతూ దూరంగా కనిపిస్తున్న టీ దుకాణం వైపు కదిలిపోయింది.

ముసల్దాని మాటల్లో పడి గమనించలేదు.

దూరంగా రైలు కూత వినిపిస్తోంది.

స్టేషన్ మాస్టారు పచ్చ లాంతరు పట్టుకొని గది బయటికి వచ్చాడు.

నేను బ్యాగు పట్టుకొని లేచి నిల్చున్నాను.

మళ్ళీ ఒక్కసారి దూరంగా వున్న సిమెంటు బెంచి కేసి చూశాను.

నా గుండె ఝల్లుమంది.

**కాకాని కమల**

ముసుగుపెట్టి శవంలా పడుకున్న శాల్తీ లేదు!

బెంచి ఖాళీగా వుంది.

అది!

ఇంతసేపు అక్కడే పడుకున్నాడు కదా కదులు మెదులు లేకుండా. ఇంతలో ఏమయ్యాడు! అది నిజంగా మనిషా లేక శవమా? దెయ్యంగా..

నా గుండె ఝల్లుమంటుంటే రైలు పెద్దగా కూత పెడుతూ ధన్ ధన్‌మంటూ స్టేషన్‌లోకి వచ్చి ఆగింది.

గబ గబా నడుస్తూ అందిన పెట్టెలోకి ఎక్కి కూర్చున్నాను.

ఐదు నిముషాలకంటే ఎక్కువ ఆగలేదు.

ఆ సిమెంటు బెంచి దాటే దాకా తలుపు దగ్గరే నిల్చున్నాను.

బెంచి ఖాళీగా వుంది.

కాని ఆ శవం అదే...అదే ఆ వ్యక్తి కప్పుకున్న

దుప్పటి మాత్రం బెంచి పక్కనే పడి వుంది.

ఇంతలో ఆ వ్యక్తి ఎటుమాయం అయిపొయ్యాడు?

నా గుండె ఝుల్లు మంటుంటే రైలు పెట్టెలోకి వచ్చి కూర్చున్నాను. జనం అంతగా లేరు. వున్న నల్గురు జోగుతున్నారు.

రైలు వేగం అందుకుంది.

అంతకంటే వేగంగా నా ఆలోచన్లు మా అమ్మ దగ్గరికి పయనించసాగాయి.

★★★

మా అమ్మకి వున్నట్టుండి షుగరు ఎక్కువయిందిట. వారం నుంచి ఆసుపత్రిలోనే వుందిట. నన్ను చూడాలనుందంటే అన్నయ్య నాకు ఫోన్ చేశాడుట!

నే వెళ్ళేసరికి అమ్మ ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చింది. కులాసాగానే వుంది.

రెండు రోజులు అమ్మ దగ్గరుండి తిరిగి సత్తుపల్లికి బయలుదేరాను.

మళ్ళీ అవసరానికి పనికొస్తుందని మిగతా రెండు రోజుల శెలవు క్యాన్సిల్ చేసుకున్నాను.

ఆ పల్లెటూళ్ళో ఇబ్బంది పడకుండా చిన్న మెడికల్ కిట్ మెయిన్‌టెయిన్ చేస్తున్నాను. అలాగే కొన్ని ఫ్యాన్సీ సామాన్లు కూడా కొనుక్కుని బ్యాగులో సర్దుకొన్నాను.

ఆ ముసల్ది జ్ఞాపకం వచ్చింది.

మళ్ళీ కనిపిస్తే దానికి కూడా రెండు క్రోసిన్ మాత్రలు ఇద్దాం అనుకున్నాను. అన్నయ్య స్టేషన్ దాకా వచ్చాడు.

సత్తుపల్లిలో రైలు దిగేసరికి రాత్రి పదికావస్తుంది.

ఎప్పటిలాగే స్టేషన్ చీకటిగా నిర్మానుష్యంగా ఉంది.

అప్రయత్నంగా నా దృష్టి 'ఆ బెంచి' మీదికి మళ్ళింది. మొన్నటిలా ఇప్పుడు ఆ బెంచి మీద శవం... ఊహ ...కాదు ముసుగు మనిషి లేదు. నా గుండె దిటవుపడింది.

దూరంగా స్టేషన్ మాస్టరు గది పక్కలో ఆ చివరకి రైలు గేటు పక్కగా లాంతరు వెలుతురు కనిపిస్తోంది. అదే చాయ్ దుకాణం అని చెప్పింది ముసల్ది. ఆ దుకాణం వెనకే దాని ఇల్లు అని కూడా అంది.

బ్యాగులోంచి క్రోసిన్ మాత్రలు తీసి వేగంగా టీ పాక వైపు నడిచాను.

జేబులోంచి సిగరెట్టు తీసి టీ మరుగుతున్న కుంపట్లో నిప్పుతో సిగరెట్టు వెలిగించుకున్నాను.

"రాజయ్య అంటే నువ్వేనా?" అడిగాను.

"అవును బాబయ్యా! తవరా పట్నం రైల్లోంచి దిగారా?"

"అవును. అది సరే. మీ దుకాణం వెనకాల ఎవరో ముసలమ్మ.."

"కన్నమ్మా బాబూ" అన్నాడు.

"ఒకసారి పిలుస్తారా?"

రాజయ్య ఆశ్చర్యంగా నా ముఖంలోకి చూశాడు. ఆ ముసల్దానితో నాకేం పని అన్నట్లు.

"ఏం..ఏం..దుకు బాబయ్యా" అన్నాడు నోరు తెరుస్తూ.

"ఏం లేదు. నే ఊరికి వెళుతుంటే టీకి డబ్బులడిగింది. బాగా జ్వరంగా వుందని మాత్ర అడిగింది. నా దగ్గరున్నాయి. ఇద్దామని" అన్నాను పొట్లం చూపిస్తూ.

రాజయ్య కళ్ళల్లో సంభ్రమం. కనుగుడ్లు పైకి పెకళ్ళుకుని వస్తున్నాయా అన్నట్లు పత్తికాయల్లా విచ్చుకుంటుంటే అడిగాడు.

"ఆ ముసిల్ది మీకు కనిపించిందా బాబూ?"

"అవును"

"ఎక్కడ బాబూ? ఎక్కడ కనిపించింది? తవరు లాస్ట్ పాసింజరు అదే పదకొండు గంటల బండికి వెళ్ళారా బాబూ? మిమ్మల్ని టీకి డబ్బు లడిగిందా బాబూ? జ్వరం అని మాత్రలు తెమ్మని అడిగిందా బాబూ?"

"అవును? ఏం అడక్కూడదా?" అన్నాను.

ఈసారి ఆశ్చర్యం నా ముఖం అంతా కదిలింది.

రాజయ్య పెళ్ళాం కాబోలు మా మాటలకి లోపల్నించి వచ్చింది.

"ఇన్నావా గౌరీ. ముసల్ది బాబుగార్ని జొరం మాత్రలు, టీకి డబ్బు అడిగిందిట! అయితే మనం విన్నది నిజమే అన్నమాట." అన్నాడు అదో గొప్ప వింతలా అబ్బురంగా.

"ఏమిటి మీరు విన్నది?"నా నొసలు ముడిపడింది. అయోమయంగా రాజయ్యకేసి చూశాను.

"తవరు ఎల్లండి బాబయ్యా " అన్నాడు.

"అదేంటయ్యా పాపం ముసల్ది ఏదో మాత్ర అడిగింది. మామూలు నాల్‌జిన్ మాత్రలే ప్రమాదం లేదు" అన్నాను.

రాజయ్య గార పట్టిన తన గొగ్గిపళ్ళన్నీ కనిపించేలా నవ్వాడు.

"పెమాదం ఆ ముసిల్దానికి కాదండయ్య మనకి. అది సచ్చి వల్లకాడై ఏడ్నార్థం అయ్యింది. అది దయ్యం అయ్యి రాత్రిళ్ళు అమావాస్య రోజుల్లో లాస్ట్ పాసింజర్‌కి వెళ్ళేవాళ్ళకి కనిపిస్తోంది బాబయ్య" అన్నాడు.

నా గుండె ఝుల్లుంది.

ఒక్క క్షణం వూపిరి అందనట్లు ఉక్కిరిబిక్కిరి అయ్యాను.

"ఆ.....!?" నా గొంతులోంచి వెర్రికేక. తలగిర్రున తిరుగుతున్నట్లు మూర్ఛ వస్తున్నట్లు ఏదో మైకం నన్నావరిస్తుంటే రాజయ్యని ఎన్నో అడగాలని నోరు తెరిచాను.

కాని అప్పటికే రాజయ్య, పెళ్ళాం గౌరమ్మ లోపలికి వెళ్ళి పోయారు.

"రాజయ్యా" అంటూ రెండు మూడుసార్లు పిలిచినా ఎవరూ పలక లేదు. నా గొంతు ఎంతో బలహీనంగా వుంది.

నా వెన్నులో ఏదో భయం.

చుట్టూ చీకటి..జీదురుమంటూ పొలాలు.

చెమట పడుతుంటే ఇంక అక్కడ ఒక్క క్షణం కూడా వుండలేనట్లు పరుగులాంటి నడకతో రైలు కట్ట దిగి మట్టి రోడ్డు మీంచి నడుస్తూ వూళ్ళోకి వచ్చి పడ్డాను. ఆ రాత్రి నాకు కలతనిదరే అయ్యింది.

★★★

ఆ మర్నాడు యథాలాపంగా ఆ ముసిల్దాని గురించి మా ప్యూన్ రత్నయ్యకి చెప్పాను.

"ఆ ముసిల్దాన్ని దెయ్యం అంటాడేంటి ఆ రాజయ్య. ఈ రోజుల్లో కూడా దయ్యాలేంటి?" అన్నాను.

రత్నయ్య లబలబ లాడాడు. "అయ్యబాబోయ్. దెయ్యాలు లేకపోవటం ఏంటి సారూ? ఆ ముసల్ది ఆ రాజయ్య తల్లి జ్వరం వచ్చి మందు లేక చచ్చిపోయింది. అది పొలం వెళ్ళి సంపాయించినంతకాలం కోడలు గౌరమ్మ ప్రేమగానే చూసింది. అది మంచం పట్టాక ఆ ముసల్దాన్ని ఆకలికి మాడ్చింది. రోగం వచ్చి ఆ ముసల్ది చచ్చిపోయింది. అది దెయ్యం అయింది. ముసల్దాని దెయ్యం చాలా మంది చూశారు. అంతే కాదు అది చచ్చిన ఆరు నెల్లకి గుడిసె అంటుకుని ఆ రాజయ్య, పెళ్ళాం కూడా చచ్చారు. అమావాస్య ముందు లాస్ట్ పాసింజర్‌కి వెళ్ళే వాళ్ళకి ఆ టీ దుకాణం, రాజయ్య, గౌరమ్మ, ముసల్ది, అప్పుడప్పుడు కనిపిస్తూ వుంటారు."

రాజయ్య గగ్గోలు పెడుతున్నట్లు ఇంకా ఏదో చెప్తూనే ఉన్నాడు.

కాని నాకు స్పృహ తప్పుతూంది.

నా ఒళ్ళంతా చెమటలు పడుతున్నాయి.

వజవజ వణుకుతూ ఆ ముసల్ది–దాని మెత్తటినల్లటి చేతి స్పర్శ–దాని గాజు కళ్ళు నాకు కనిపిస్తున్నాయ్.

★

